# కృషి KRISHI

A magazine for Sustainable Agriculture


సంపుటి -1 పత్రిక సంచిక - 6

VOLUME -1 MAGAZINE ISSUE - 6





## పర్యావరణ సన్నిహిత సస్యరక్షణ పద్ధతులు


సెప్టెంబర్ 2004 – ఏప్రిల్,2005

September 2004 - April 2005

Published by

DDS - Krishi Vigyan Kendra

P.B. No. : 21, Zaheerabad - 502 220

Medak Dist., Andhra Pradesh, India



పచ్చజొన్న

పంటరకం : పచ్చజొన్న

పంట కాలం : నాలుగు నెలలు

పండె భూములు : గర్వ భూములు, రేగడి భూములు

వరస / వర్షం అవసరం : రెండు మూడు పెద్దవానలయితే మంచిగా పండుతాయి.

ఎకరానికి దిగుబడి : ఏడు నుండి ఎన్మిది క్వింటాళ్ళు.

మేత వస్తదా : 700 నుండి 800 కట్టల సొప్ప.

భూమికి బలం ఇస్తదా : బలం ఇవ్వకున్నాగాని ఎక్కువ తియ్యదుకూడ.

పక్కం పంటనా : అవుడు - బొలెంతలకు వస్తది. గొడకోస్తే మంచిది,

పురుగు / రోగం కి తట్టుకుంటదా : చాలావరకు తట్టుకుంటది

పండుగలకు పబ్బాలకు వస్తదా : రాదు.

విత్తనం నిల్వ : ఎన్ను కోసినప్పుడు చూసి, తెల్ల పూస వున్నది విత్తనంకు దాచుతరు.

ఎన్నులను వేపాకు వేసి కొడుతరు. వచ్చిన విత్తనాలను బూడిద వేసి పొత్తు పెడుతరు.

వేరే ప్రత్యేకతలు : పచ్చజొన్న రొట్టె పాచిపోదు.

## NUTRIENT COMPARISON :JOWAR & RICE

### పోషక విలువలు పోలిక : జొన్నలు - వరి



## విషయ సూచిక


| | | |
|---|---|---|
| పచ్చపురుగు యాజమాన్యంలో పర్యావరణ సన్నిహిత సస్యరక్షణ పద్ధతులు | - | 3 |
| ఆహార ధాన్యాలు - పోషక విలువలు | - | 6 |
| విత్తన బ్యాంక్‌లో లభించు విత్తనాల వివరాలు | - | 8 |
| సాంప్రదాయ పశువైద్యం | - | 9 |
| వర్మీకంపోస్ట్ తయారీ | - | 10 |
| గత ఎనిమిది నెలలలో కె.వి.కె నందు జరిగిన ముఖ్య కార్యక్రమాలు | - | 13 |
| ఆకుకూరల పరిచయం | - | 15 |


# పచ్చపురుగు యాజమాన్యంలో పర్యావరణ సన్నిహిత సస్యరక్షణ పద్ధతులు

వాతావరణానికి ప్రయోజనకరమైన ఆర్థికంగా లాభసాటిగా వుండే సులువైన సాధనాల ద్వారా ఈ పురుగును అరికట్టే విధానాలను డి.డి.యస్ 'కృషివిజ్ఞాన కేంద్రం' సేకరించి వాటిని ఒక చిత్ర రూపంలో (కవర్ పేజీలో ఇవ్వబడింది) రూపొందించి, శిక్షణాకార్యక్రమాలద్వారా రైతులలో ఈ పద్ధతుల ప్రాచుర్యానికి కృషిచేస్తుంది.

**రసాయనిక పురుగు మందులు వాడకుండా పచ్చపురుగును నియంత్రించే విధానాలు :**

1. వేసవిలో పొలాన్ని లోతుగా దున్నడం.
2. అంతర పంటలు వేయడం.
3. పంట చుట్టూ ఎర పంటను వేయడం.
4. పొలంలో పక్షులు కూర్చొనేందుకు వీలుగా తమర (పంగ) కొయ్యలను నాటడం.
5. చేత్తో లార్వాలను సేకరించి నాశనం చెయ్యడం.
6. పశువుల పేడ, మూత్రం కలిపి వాడకం.
7. బెల్లపు మిశ్రమం వాడకం.
8. మిరప - వెల్లుల్లి (ఎల్లిగడ్డల) మిశ్రమం వాడకం.
9. వేప గింజల ద్రావణం వాడకం.
10. పొగాకు ద్రావణం వాడకం.

**1. వేసవిలో పొలాన్ని లోతుగా దున్నడం :**

రైతుల వ్యవసాయక సంస్కృతి ఫలితంగా ఎంతో కాలం నుండి అమలులో వున్న పద్ధతి ఇది. పురుగు ఆశించడాన్ని దూరదృష్టితో అరికట్టే పద్ధతి ఇది. పొలాన్ని లోతుగా దున్నడం ద్వారా నేలలో వృద్ధి నొందే పురుగుల పెరుగుదలను కొంతవరకు నిరోధించవచ్చు. ఈ పద్ధతిద్వారా

1. పురుగును చేత్తోగాని, కాలితో గాని నాశనం చెయ్యవచ్చు.
2. నిద్రావస్థలో ఉన్న పురుగును బయట పడేట్టు చేయడం ద్వారా పిట్టలకు ఆహార మగునట్లు చేయడం.
3. నేల భౌతిక పరిస్థితులను మార్చడం ద్వారా పంట దిగుబడిని వేగవంతం చెయ్యవచ్చు.

క్రిమి సంహారక మందులు వాడకుండా కేవలం యాజమాన్య పద్ధతుల ద్వారా పచ్చ పురుగును నియంత్రించే చర్యల్లో భాగంగా ఈ పద్ధతి రైతుల వాడుకలో వుంది. వేసవిలో భూమిని లోతుగా దున్నడం ద్వారా పెరుగుతున్న ప్యూపాలను పక్షుల వంటి సహజ శత్రువుల బారినపడేట్లు చెయ్యవచ్చు లేదా తీవ్రమైన ఎండకు బహిర్గతం కావచ్చు. ఈ విధమైన నివారణ పద్ధతులు పురుగు పెరుగుదలను కొంతవరకు నిరోధించడానికి తోడ్పడతాయి.

## 2. అంతర పంటలు వేయడం :

ఒకే పొలంలో రెండు లేదా మూడు పంటలను పండించడం ద్వారా ఏదేని కారణాల ద్వారా ఒక పంట దిగుబడిలో రైతు పొందిన నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు. మెదక్ జిల్లా రైతులు సాంప్రదాయకంగా దేశవాళి మరియు ఎర్రకంది రకాన్ని అంతరపంటలుగా సాగుచేస్తున్నారు. కేవలం ఒక పంటను పండించడం కంటే ఈ రకమైన అంతర పంటలు పండించడం శాస్త్రీయంగా ఉపయోగకరమైన, శాశ్వతమైన పద్ధతిగా గుర్తించడం జరిగింది. జొన్న, ఎర్రకంది అంతర పంటగా వేయడం ద్వారా ముఖ్యంగా జొన్నపంట ఎన్ను తొడిగే దశలో పక్షులను ఆకర్షించడం జరుగుతుంది. ఈ రకంగా పక్షుల సహజ శత్రువుల భూమికను కొంతవరకు బలపరుస్తుంది.

## 3. పంట చుట్టూ ఎర పంటను వెయ్యడం :

ముఖ్యమైన పంటకు దగ్గరలోనే పురుగులను ఆకట్టు కోవడానికి వాటికిష్టమైన పంటను నాటే పద్ధతి. బంతి మొక్కలను ఎరపంటగా వేయడం ద్వారా కంది పంట నాశించే శనగపచ్చ పురుగును అరికట్టవచ్చు. పురుగును ఆకర్షించడానికి బంతి పూల పంట ఉపయోగపడుతుంది. తద్వారా ఎర్రకందికి పచ్చశనగ పురుగుల వల్ల వాటిల్లే నష్టం కొంతవరకు తగ్గే అవకాశముంది. శనగ పచ్చ పురుగుజాతికి చెందిన ఆడ పురుగులు బంతి పూలపై గుడ్లు పెడతాయి.

గుడ్లు పొదిగిన తర్వాత ఆ లార్వాను సేకరించి నాశనం చెయ్యవచ్చు. ఈ రకంగా అంతర పంటలను, ఎర పంటలను వేయడం బహు ముఖ వ్యవసాయక పద్ధతులకు సంబంధించిన విధానం. దీని ద్వారా పంటలను ఆశించే పురుగుల పునరుత్పత్తిని అరికట్టడం ద్వారా కొంతవరకు వాటి పెరుగుదలను, ప్రభావాన్ని తగ్గించవచ్చు. అదే సందర్భంలో పురుగులకు శత్రువులైన పక్షులకు అవసరమైన తిండిని పొలంలో వేయడం ద్వారా పురుగులను నాశనం చేసే సహజ శత్రువులను కూడా ప్రోత్సహించినట్లవుతుంది.

## 4) పొలంలో పక్షులు కూర్చోనేందుకు వీలుగా తమర (పంగ) కొయ్యలను నాటడం :

పురుగులను తిని నాశనం చెయ్యడంలో పక్షులను ముందుగా మనం చెప్పుకోవాలి. ఎకరాకు పది చొప్పున పక్షులు కూర్చోనేందుకు పంగ కొయ్యలను నాటడం ద్వారా శనగ పచ్చ పురుగు లార్వాలు పక్షులు తినేట్లు చెయ్యవచ్చు. కొయ్య దుంగ కాని, లేదా నేరిన పంగ కొయ్యకు మట్టి పాత్రను కట్టి నీటితో నింపి జొన్న గింజలు కలిపి పక్షులను ఆకట్టుకోవచ్చు. పక్షులను ఆకర్షించడానికి పొలాల్లో బొరుగులు (మరమరాలు) చల్లి కూడా ఆకర్షించవచ్చు.

## 5) చేత్తో లార్వాలను సేకరించి నాశనం చెయ్యడం :

శనగ పచ్చ పురుగు బారి నుండి తప్పించుకునే పద్ధతుల్లో రైతులు ఆశ్రయించే చిట్టచివరి పద్ధతి లార్వాలను చేత్తో సేకరించి నాశనం చెయ్యడం, ఎందుకంటే ఇది ఎంతో శ్రమతో కూడుకున్న పద్ధతి. సేకరించిన లార్వాలను కాల్చివేయడం ద్వారా నాశనం చేస్తారు. **హెలికోవెర్పా ఆర్మిగెరా** యాజమాన్య పద్ధతుల్లో క్రిమి సంహారక మందులు వాడకుండా, వాతావరణ సమతుల్యానికి ఆటంకం కలిగించని ఇటువంటి పద్ధతులు ఎన్నో వాడుకలో వున్నాయి.

## 6) పశువుల పేడ, మూత్రం కలిపి వాడకం :

ఈ మిశ్రమాన్ని ఉపయోగించడం ద్వారా కొంతవరకు పురుగు అభివృద్ధిని అరికట్టవచ్చు. ఈ మిశ్రమం చల్లినప్పుడు గుడ్లు పెట్టడానికి పురుగు ఇష్టపడదు. ఈ మిశ్రమాన్ని ఉపయోగించడం ద్వారా పురుగు పెరుగుదలను అరికట్టడం మాత్రమే కాకుండా, నేలను సారవంతం చేసి పంటలో పువ్వు ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఆశించిన ఫలితాలు రావాలంటే రోజూ మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత ఈ మిశ్రమాన్ని చల్లాలి. మరింత ఫలితాలు పొందాలంటే రోజుకు రెండు మూడు సార్లు చల్లవచ్చు.

### తయారు చేసే విధానం :

3 లేదా 5 లీటర్ల పశువుల మూత్రాన్ని 3 లేదా 5 కేజీల పేడతో కలిపి ఒక తొట్టెలో వేసి మూత పెట్టి బాగా పులిసేట్లు చెయ్యాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని పల్చని గుడ్డతో వడగట్టితే చిక్కటి ద్రవం వస్తుంది. ఈ ద్రవంలో వుండే ఆమ్ల లక్షణాన్ని 200 లేదా 250 గ్రాముల సున్నం వేయడం ద్వారా తటస్థం చేయవచ్చు. ఈ రకంగా తయారు చేసుకున్న ద్రావణాన్ని 50 లేదా 80 లీటర్ల నీటితో కలిపి ఒక ఎకరాకు చల్లడానికి ఉపయోగించవచ్చు.

## 7. బెల్లపు మిశ్రమం వాడకం :

పొలంలో ఐదు శాతం ఈ బెల్లపు మిశ్రమాన్ని చల్లడం ద్వారా చీమలనూ, పేడ పురుగులనూ ఆకర్షించవచ్చున్నది రైతుల అనుభవంలోని విషయం. ఈ మిశ్రమంలో వుండే తియ్యదనం హెలికోవెర్ప గుడ్లనూ, పెరుగుదల దశలో వుండే లార్వాలను చీమలు తినేట్లుగా ప్రోత్సహిస్తుంది. 4 కిలోల బెల్లాన్ని 8 లీటర్ల నీటితో కలిపి చిక్కటి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీన్ని 80 లీటర్లు చేసుకొని ఒక ఎకరాకు

ఉపయోగించుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ఉపయోగించడం వల్ల కేవలం చీమలను ఆకర్షించడం మాత్రమే కాకుండా, ఆకుల మృదుత్వాన్ని కూడా అభివృద్ధి చేయవచ్చుని రైతులు తమ అనుభవం ద్వారా తెలుసుకున్నారు. తక్కువగా చీమల పుట్టలుండే పొలాల్లో ఈ ద్రావణం యొక్క ప్రభావం ఎక్కువగా వుండటం రైతులు పరిశీలించారు. చీమల పెరుగుదలను పొలాల్లో అధికం చెయ్యడానికి ఈ పద్ధతి దోహదం చేస్తుంది.

## 8. మిరప - వెల్లుల్లి (ఎల్లిగడ్డలు) మిశ్రమం వాడకం :

మూడు లేక నాలుగు కిలోల పచ్చిమిరప కాయలను బాగా దంచి 8 లీటర్ల నీళ్ళలో కలపాలి. బాగా దంచిన 400 నుండి 750 గ్రాముల ఎల్లిగడ్డలని, 150 నుండి 200 మిల్లీ లీటర్ల కిరోసిన్‌లో ఈ రెండింటిని వేసి మిశ్రమాన్ని కఱ్ఱతో కలిపి, పల్చటి గాజుగుడ్డతో వడ గట్టాలి. 50 నుండి 100 గ్రాముల సబ్బు పొడిని మిరప మరియు ఎల్లిగడ్డల ద్రావణంతో కలిపి సిద్ధం చేసుకోవాలి.

దీన్ని 50 నుండి 80 లీటర్ల నీటితో కలిపి ఒక ఎకరా పంటపై చల్లడానికి ఉపయోగించవచ్చు.

## రైతుల అభిప్రాయాలు :

1. ఆడపురుగులు, మిరప – వెల్లుల్లి మిశ్రమం చల్లిన భాగం మీద గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు.
2. ద్రావణంలోని ఘాటైన లవణాలు పంట పైభాగంలో పరుచుకోవడం పురుగులు గుడ్లు పెట్టడాన్ని నిరోధిస్తుంది.
3. ద్రావణంలోని కిరోసిన్ లార్వాల సున్నితమైన తళతళలాడే చర్మాన్ని ముడతలు పడేట్టుగా చేస్తుంది.
4. మిరపలో సాధారణంగా వుండే ఘాటు, మంట పుట్టించే గుణం వల్ల పురుగు పంట దగ్గరికి చేరదు.
5. మిరప వెల్లుల్లి మిశ్రమం సూచించిన రీతిలో నానబెట్టి మధ్యాహ్నం మూడుగంటల తర్వాత చల్లినప్పుడే తగిన ఫలితాలను ఇవ్వగలుగుతుంది.

## 9. వేపగింజల ద్రావణం వాడకం :

ఈ మిశ్రమం పురుగు గుడ్లు పెట్టడానికి వ్యతిరేకమైన పరిస్థితి కలిగించి గుడ్లు పెట్టడాన్ని నిరోధిస్తుంది. పంట ఆకుల పైనా ఇతర భాగాలపైనా ఘాటైన ఈ మిశ్రమం చల్లడం వల్ల తరువాత లార్వాలు ఆహారం తినలేక నాశనమవుతాయి. వేపగింజల మిశ్రమం పురుగు పెరుగుదల లోని వివిధ దశలపై ఈ రకంగా ప్రభావాన్ని చూపుతుంది.

ఎక్డైసోన్ హార్మోన్‌ను అరికట్టడం ద్వారా పురుగు వివిధ దశల్లో పెరగకుండా లార్వాను ఎదుగుదల లేకుండా చేసి చివరికి నాశనమయ్యేట్లు చేస్తుంది.

తక్కువ తీవ్రత గలిగిన మిశ్రమమైతే పునరుత్పత్తి సామర్థ్యం లేని పురుగులు వృద్ధి చెందేందుకు దోహదం చేసి, పురుగు అభివృద్ధిని అరికడుతుంది.

## వేప గింజల ద్రావణాన్ని తయారు చెయ్యడం :

10 లేదా 15 కేజీల వేపగింజలను తీసుకొని మెత్తగా దంచాలి. ఈ పొడిని గాజు గుడ్డతో ఒక మూటగా కట్టి 80 లేదా 100 మీటర్ల నీటిలో ఒక రాత్రి మునిగేట్లు వుంచాలి. మూటను నాలుగు లేదా 5 సార్లు గట్టిగా పిండి గింజల్లోని సారమంతా నీళ్ళల్లోకి చేరునట్లుచూడాలి. 50 లేదా 100 గ్రాముల సబ్బు పొడిని కలిపి తెల్లటి రంగులో వేపగింజల మిశ్రమాన్ని తయారు చేసుకోవచ్చు.

## గమనించవలసిన విషయాలు

వేపచెట్లు కాయలు కాసే కాలంలో, వేపకాయలు ఏరి నిల్వ చేయాలి. ఎనిమిది నెలలు పైబడి నిలవ చేసిన వేపగింజలు ఉపయోగించ వద్దు. ఎనిమిది నెలలు పైబడి నిలవ చేసిన గింజలు గుణాన్ని కోల్పోవడం వల్ల ఈ మిశ్రమం తయారు చేయడానికి ఉపయోగపడవు. మంచి ఫలితాలు రావాలంటే మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత ఈ మిశ్రమాన్ని చల్లాలి.

## 10. పొగాకు ద్రావణం వాడకం :

750–1000 గ్రాముల ఎండిన పొగాకు ముక్కలు తీసుకుని 5 నుండి ఎనిమిది లీటర్ల నీటిలో మరగ బెట్టి డికాక్షను తయారు చేసుకోవాలి. గాజు గుడ్డతో వడగట్టిన ద్రావణానికి 50 నుండి 100 గ్రాముల బట్టలుతికే పొడి కలుపుకోవాలి.

దీనికి 50–80 లీటర్ల నీటిని కలిపితే ఒక ఎకరా పంటకు చల్లడానికి ఉపయోగపడుతుంది. ద్రావణంలోని ఘాటైన లక్షణం పురుగు ఆశించకుండా పంటను సంరక్షిస్తుంది.

ఈ ద్రావణంను మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత పంట పై చల్లాలి.

ఈ రకమైన సహజ ద్రావణాలను ఒకదాని తర్వాత ఒకటి చల్లడం ఉపయోగకరంగా వుంటుంది. ఒకే రకమైన ద్రావణాన్ని వరుసగా రెండుసార్లు చల్లకూడదు. ఆయా ద్రావణాలను తయారు చెయ్యడంలో నిర్దేశించిన సూచనలు పాటించి పంట నాశించే కాయ తొలుచు పురుగు నిరోధానికి ఉపయోగించవచ్చు.

# ఆహార ధాన్యాలు - పోషక విలువలు

మనం ప్రతిరోజు తినే ఆహారంలో 70–80 శాతము ధాన్యాలే. మనకు అవసరమైన శక్తి అధికంగా ధాన్యాల నుండి లభిస్తుంది. శరీర అభివృద్ధికి, ఎదుగుదలకు కావలసిన మాంసకృత్తులను 50 శాతము వరకు ఈ ధాన్యాలే అందిస్తాయి! మన అనుదిన అవసరాలకు కావలసిన ఇతర పోషకాలైన, కాల్షియం, ఇనుము, పీచు పదార్థం ధాన్యాలలో కావలసినంత వున్నాయి.

1. **పోషక విలువలు :** ధాన్యాలన్ని ఒకే రకమైన పోషక విలువలు కలిగివుండవు. పోషకాలు లభ్యమయ్యే స్థాయి కూడ వేరు, వేరుగా ఉంటుంది.

   ఉదా॥ 100 గ్రా. బియ్యంలో 10 మి.గ్రా కాల్షియం వుంటే 100 గ్రా తైదల్లో 344 మి.గ్రా కాల్షియం వుంది.

2. **సురక్షిత ఆహారం :** సాగునీటి వసతితో, హైబ్రిడ్ విత్తనాలతో పండించే పంటలకు అధిక శాతం రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం తప్పనిసరి. మన ఆరోగ్యానికి ఈ రసాయన కలుషిత ఆహారం హాని కలిగిస్తుంది.

   వర్షాధార పంటలైన కొర్ర, తైద, సజ్జ, సాయిజొన్న పంటలు ఎటువంటి రసాయనాలు లేకుండా పండిస్తారు కనుక ఇవి సురక్షిత ధాన్యాలు!

3. **ఔషధ విలువలు :** పచ్చ జొన్నలు పత్యం దినుసు. బాలింతలకు బలవర్ధక ఆహారం. కొర్రలు ఉష్ణ వస్తువు. చలికాలంలో తప్పక తినవలసిన ధాన్యం కొర్ర అంబలి. జీడిగింజ వేసి కాచి త్రాగితే దగ్గు పడిశం తగ్గుతుంది. చక్కెర వ్యాధి వున్నవారు ఉదయము పూట తైద అంబలి తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది.

   ఈ ధాన్యాలన్ని పీచు పదార్థాన్ని కలిగి వుంటాయి. ఈ పీచు పదార్థం శరీరంలోగల కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మన ఆహారంలో తగినంత (40 గ్రా) పీచు పదార్థం వుంటే జీర్ణకోశ వ్యాధులు మనకు దూరంగా వుంటాయి.

4. **ఆర్థిక విలువ :** అనారోగ్యానికి గురై, ఆసుపత్రికి, మందులకు ఖర్చు చేయక, మందులేని వ్యవసాయ పంటలైన ధాన్యాల వాడకం కొరకు మన ధనాన్ని వెచ్చించడం ఉత్తమమైన పని.

5. **వైవిధ్యం :** సుసంపన్నమైన ఆహార వైవిధ్యం మన సొంతం. 24 రకాల ధాన్యాలు అందుబాటులో వుండగా కేవలం వరి అన్నం, గోధుమ, రొట్టెకే మనం అలవాటు పడ్డాం. రకరకాల ఆహార ధాన్యాలను, వివిధ రకాలుగా వండటం ద్వారా మన ఆహారం వైవిధ్యాన్ని, మన జీవన సంస్కృతిని సజీవంగా ముందు తరాలకు అందించడానికి ఆహార వైవిధ్యం అలవాటు చేసుకోవడం ద్వారా సురక్షిత, భవిష్యత్‌ను భావితరాలకు ఇవ్వగలుగుతాము.

| | |
|---|---|
| పచ్చజొన్న | తెల్లకొర్రలు |
| తెల్లసామలు | బైలు నల్లబుట్ట వడ్లు |
| తెల్లమల్లె జొన్న | ఎర్రకొర్రలు |
| నల్లసామలు | బైలు ఎర్రవడ్లు |
| కాకిముట్టని జొన్న | నల్లకొర్రలు |
| కోడిసామలు | బైలు తెల్లబుడ్డ వడ్లు |
| ఎర్రజొన్న | మంచుకొర్రలు |
| సజ్జలు | నల్లముల్లు గోధుమ |
| సాయిజొన్న | తెల్లతైదలు |
| కట్టె గోధుమ | ప్యాలాల జొన్న |
| ఎర్రతైదలు | బుట్ట గోధుమ |

# 100 గ్రాముల ధాన్యాలలో ఉండే

# పోషక విలువలు :

| ఆహార ధాన్యం | మాంస కృతులు | క్రొవ్వు పదార్ధం | లవణాలు | పీచు పదార్ధం | పిండి పదార్ధం | శక్తి కిలో కేలరీలు | కాల్షియం | ఫాస్ఫరస్ | ఇనుము | కెరోటిన్ | ధాయమిన్ | రైబోఫ్లేవిన్ | నయాసిన్ | ఫోలిక్ ఏసిడ్ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రా. | గ్రా. | గ్రా. | గ్రా. | గ్రా. | | మి.గ్రా. | మి.గ్రా. | మి.గ్రా. | మి.గ్రా. | మి.గ్రా. | మి.గ్రా. | మి.గ్రా. | మి.గ్రా. |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) | (13) | (14) | (15) |
| వరి | 6.8 | 0.5 | 0.6 | 0.2 | **78.2** | 345 | 10 | 160 | 0.7 | 0 | 0.06 | 0.06 | 1.9 | 8.0 |
| సజ్జలు | 11.6 | **5.0** | 2.3 | 1.2 | 67.5 | **361** | 42 | 296 | 8.0 | **132** | 0.33 | **0.25** | 2.3 | **45.5** |
| కొర్రలు | **12.3** | 4.3 | **3.3** | 8.0 | 60.9 | 331 | 31 | 290 | 2.8 | 32 | **0.59** | 0.11 | 3.2 | 15.0 |
| జొన్నలు | 10.4 | 1.9 | 1.6 | 1.6 | 72.6 | 349 | 25 | 222 | 4.1 | 47 | 0.37 | 0.13 | 3.1 | 20 |
| తైద | 7.3 | 1.3 | 2.7 | 3.6 | 72.0 | 328 | **344** | 283 | 3.9 | 42 | 0.42 | 0.15 | 1.1 | 18.3 |
| సాములు | 7.7 | 4.7 | 1.5 | 7.6 | 67 | 341 | 17 | 220 | **9.3** | 0 | 0.30 | 0.09 | 3.2 | 9.0 |
| ఆర్గులు | 6.2 | 2.2 | 4.4 | **9.8** | 65.5 | 307 | 20 | 280 | 6.0 | 0 | 0.33 | 0.10 | **4.2** | 0 |
| మొక్కజొన్న | 11.1 | 3.6 | 1.5 | 2.7 | 66.2 | 342 | 10 | **348** | 2.0 | 90 | 0.42 | 0.1 | 1.8 | 20 |

# విత్తన బ్యాంక్‌లో లభించు విత్తనాల వివరాలు

| పంట | విత్తనం ఖరీదు కిలో ఒక్కింటికి | విత్తనానికి విత్తనం ఇచ్చే పద్ధతి |
|---|---|---|
| పచ్చజొన్న | 8 | 1:2 |
| తెల్ల మల్లె జొన్న | | |
| ఎర్రజొన్న | | |
| కాకి ముట్టని జొన్న | 7 | ,, |
| తెల్ల కొర్ర | 7 | ,, |
| మంచు కొర్ర | 7 | ,, |
| నల్లకొర్ర | | ,, |
| ఎర్రకొర్ర | 10 | ,, |
| తెల్ల తైద | 10 | ,, |
| ఎర్ర తైద | | |
| తెల్లసామ | 7 | ,, |
| నల్లసామ | 8 | ,, |
| కోడిసామ | 7 | ,, |
| ఆర్గులు | 6 | ,, |
| సజ్జలు | 7 | ,, |
| మంచిపెసరి | 15 | ,, |
| గంగ పెసరి | 15 | ,, |
| బాలింత పెసరి | 15 | ,, |
| తీగ పెసరి | 20 | ,, |
| దేశి మినుము | 13 | ,, |
| గడ్డి నువ్వు | 25 | ,, |
| జమాల్ నువ్వులు | 25 | ,, |
| ఎర్రతొగరి (కంది) | 20 | ,, |
| బురక తొగరి | 20 | ,, |

| పంట | విత్తనం ఖరీదు కిలో ఒక్కింటికి | విత్తనానికి విత్తనం ఇచ్చే పద్ధతి |
|---|---|---|
| తెల్ల తొగరి | 20 | ,, |
| నల్ల తొగరి | 18 | ,, |
| తెల్ల అనుమిలు | 20 | ,, |
| నల్ల అనుమిలు | 20 | ,, |
| ఎర్ర బెబ్బర్లు | 20 | ,, |
| తెల్ల బెబ్బర్లు | 20 | ,, |
| ఉలవలు-ఎర్ర | 15 | ,, |
| ఉలవలు-నల్ల | 15 | ,, |
| ఉలవలు-తెల్ల | 15 | ,, |
| పుండి-ఎర్ర | 10 | ,, |
| పుండి-తెల్ల | 10 | ,, |
| బైముగులు | 15 | ,, |
| నల్లబుడ్డవడ్లు | 15 | ,, |
| ఎర్ర బుడ్డవడ్లు | 10 | ,, |
| తెల్ల బుడ్డవడ్లు | 10 | ,, |
| | | |
| <u>రబీ విత్తనాలు</u> | | |
| సాయ జొన్న | 13 | ,, |
| ఎర్ర జొన్న | 13 | ,, |
| ప్యాలాల జొన్న | 13 | ,, |
| దేశి శనగలు | 14 | 2:3 |
| నల్ల శనగలు | 14 | ,, |
| తెల్ల శనగలు | 16 | ,, |
| ఆవాలు | 20 | ,, |

| పంట | విత్తనం ఖరీదు కిలో ఒక్కింటికి | విత్తనానికి విత్తనం ఇచ్చే పద్ధతి |
|---|---|---|
| నల్ల బటగాల్లు | 16 | ,, |
| తెల్ల బటగాల్లు | 16 | ,, |
| మిరప | 30 | ,, |
| ధనియా | 18 | 1:2 |
| నల్ల ముల్లు గోధుమ | 10 | 2:3 |
| కట్టె గోధుమ | 10 | ,, |

| పంట | విత్తనం ఖరీదు కిలో ఒక్కింటికి | విత్తనానికి విత్తనం ఇచ్చే పద్ధతి |
|---|---|---|
| బుడ్డ గోధుమ | 8.50 | ,, |
| చిరి శనగ | 21 | ,, |
| లంకలు | 10 | ,, |
| అవిశలు | 20 | ,, |
| తెల్ల కుసుమ | 16 | ,, |

బిడెకన్నె పెద్ద చంద్రమ్మ మరియు హుమ్నాపూర్ లక్ష్మమ్మల ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న డిడిఎస్ మహిళా సంఘాల విత్తన నిధి నుండి పైన తెలుపబడిన విత్తనాలు లభించును.

# సాంప్రదాయ పశువైద్యం

## పారుడు రోగం :

**కారణాలు:**

1. జీర్ణకోశ పరాన్న జీవులు
2. ఆహారంలో అకస్మాత్ మార్పు
3. కలుషిత నీరు
4. ఎక్కువ (అతిగా) తినడం.,

**లక్షణాలు:**

1. పారుడు, రక్తం మరియు జిగురు
2. ఆకలి లేకపోవడం
3. పొడి చర్మం
4. కండ్లు లోతుకు పోవడం
5. డిహైడ్రేషన్

**చికిత్స :**

1. పిడికెడు తెల్లపూల్చేరి ఆకులు మెత్తగా నూరి, పావులీటరు పెరుగుతో కలిపి 2 సార్లు పశువుకు తినబెట్టాలి.
2. చిటికెడు పసుపు, చిటికెడు వెన్న కలిపి, పశువు 'నాలిక'కు రాయాలి. రోజుకు రెండుసార్లు చొప్పున 3 రోజులు చేయాలి.
3. తెల్లపుల్చేరి, దంతి మరియు నల్లతుమ్మ ఆకులను పిరికెడు (ఒక్కొక్కటి పిడికెడు) తీసుకొని మెత్తగా నూరి, బెల్లం నీళ్ళతో కలిపి రోజుకు ఒకసారి చొప్పున 2 రోజులు పశువు తేపాలి.
4. సగం కొబ్బరి కుడుక, పిడికెడు ఎగెటకట్టె ఆకులు మరియు చటాక్ సోంపు మెత్తగా దంచి, రోజుకు ఒకసారి చొప్పున 2 రోజులు తినబెట్టాలి.
5. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి పెరుగుతో రోజుకు 2 సార్లు తినబెట్టాలి. 2 రోజులు వాడాలి.
6. గుటగుట ఆకులను 'ఒక పిడికెడు' మెత్తగా నూరి, రసం తీయాలి. దీనికి పెరుగు కలిపి రోజుకు రెండు సార్లు చొప్పున 2 రోజులు పశువుకు త్రాగించాలి.

✳ తాగు నీటిని పరిశుభ్రంగా పశువుకు ఇవ్వాలి.

✳ నట్టలు లేకుండా చూడాలి.

# వర్మీకంపోస్ట్ తయారీ

ఏ పంటైనా బాగా పండాలంటే ముఖ్యంగా కావలసింది భూమి సారవంతంగా వుండటం. అనేక సంవత్సరాలుగా రసాయనిక ఎరువుల వాడకంవల్ల పంట భూములు నిస్సారమైపోవడమే కాకుండా వాతావరణ కాలుష్యం పెరిగింది. అందువల్ల భూమిసారాన్ని పెంచేందుకు, కాలుష్యనివారణకు సేంద్రీయ ఎరువుల అవసరం నేడు ఎంతైనా వుంది. అటువంటి ఎరువులలో ఒకటైన వర్మీకంపోస్ట్‌వల్ల భూసారం పెరగడమే కాక పంటలు బాగా పండుతాయి.

వానపాముల పెంపకాన్ని వర్మీకల్చరని, వానపాములు తిని విసర్జించే పదార్థాల్ని వర్మీకంపోస్ట్ అని అంటారు.

## వర్మీ బెడ్‌లో వేయవలసిన పదార్థాలు

### కింది పదార్థాలు వానపాముల ఆహారం

✲ పచ్చి ఆకులు

✲ ఎండు ఆకులు

✲ ఎండుగడ్డి

✲ కూరగాయల, పళ్ళ తొక్కలు

✲ కాగితాలు

✲ పశువులపేడ

✲ కొబ్బరి పీచు

### వర్మీబెడ్ తయారీ పద్ధతి

☛ పైన పాక వంటి కప్పు వుంటే ఎండవేడి, భారీ వర్షం నుండి వానపాములను కాపాడుకోవచ్చు. చెట్టు నీడలో కూడా బెడ్ వేసుకోవచ్చు.

భూమిపై 1 అడుగు ఎత్తు, 1 గజం వెడల్పుతో మనకు అవసరమున్నంత పొడవుతో బెడ్ తయారుచేసుకోవాలి. నీడ ఉంటే బెడ్ ఎంత పొడువైనా వేసుకోవచ్చు.

☛ బెడ్ కట్టిన తర్వాత అడుగు భాగాన ఒక అంగుళం మందాన ఇటుక పెళ్ళల వరుస వేయాలి. దానిపైన ఒక అంగుళం మందాన ఇసుక, ఆపైన మరో అంగుళం మందం మట్టి వేయాలి. మట్టి జిగటుగుణం (బంకమన్నుగా) కలిగి ఉండరాదు. ఎందుకంటే వానపాములకు కదలిక కష్టం అవుతుంది.

☛ బెడ్‌లో చెదలు పట్టకుండా వేపాకులుగానీ, కానుగ ఆకులుగానీ మట్టి వరుసపై చల్లాలి.

☛ మట్టిపై 3 అంగుళాల మందాన కుళ్ళే వ్యవసాయ వ్యర్థపదార్థాల వరుస వేయాలి.

✲ చెదలు పట్టకుండా కానుగ ఆకులు పరచడం

✲ గడ్డి వరుస వేయడం

చెత్తవరుసపై ఎండిన పేడను వేయాలి. పచ్చిపేడ వాడితే వానపాములు చచ్చిపోయే ప్రమాదముంది.

**వర్మీ కల్చర్‌బెడ్‌లో ప్లాస్టిక్, గాజు రబ్బరు, టిన్ వంటి వస్తువులను వేయకూడదు.**

☛ బెడ్‌పూర్తిగా తడిసేలా నీళ్ళు పోయాలి. అయితే బెడ్ అడుగున నీళ్ళు నిలువకుండా జాగ్రత్త వహించాలి.

☛ బెడ్ తయారు చేశాక దానిపై వానపాములు వదలాలి. బెడ్‌లో తగినంత తేమ ఎప్పుడూ వుండేలా ఎండాకాలంలో రోజు విడిచి రోజు 5-6 కడవల నీళ్ళు, అదే వానాకాలం లేదా చలికాలంలోనయితే 4-5 రోజులకొకసారి 5-6 కడవల నీళ్ళు పోయాలి.

☛ క్రమంగా వానపాములు ఆ వ్యర్థపదార్థాలన్నింటినీ తిని విసర్జిస్తాయి. వానపాములను వదిలిన 30-40 రోజులలో వర్మీకంపోస్ట్ తయారవుతుంది. వానపాముల సంఖ్య ఎక్కువగా వుంటే బెడ్‌లో త్వరగా కంపోస్ట్ తయారవుతుంది. తయారయ్యాక 4-5 రోజులు నీళ్ళు పోయకుండా కుప్ప చేయాలి. అలా చేస్తే వానపాములు కింద వేసిన ఇటుక, ఇసుక, మట్టి వరుసలలోకి వెళ్ళిపోతాయి.

☛ కొద్దిగా ఆరనిచ్చి ఇసుకజల్లెడతో జల్లిస్తే వచ్చే వర్మీ ఎరువు తేలికగా వుంటుంది. దీనిని సంచులలో నింపుకోవచ్చు.

## సూచనలు

- రసాయనిక ఎరువులు వాడివున్న పొలంలో పూర్తిగా వర్మీ కంపోస్ట్ వాడవచ్చు. వర్మీ కంపోస్ట్‌తో పాటు పశువుల ఎరువు, ఇతర సేంద్రియ ఎరువులు తప్పకుండా వాడాలి. అన్ని రకాలు కలిపి వాడడం వలన మంచి ఫలితాలుంటాయి.
- కోళ్ళు, ఎలుకలు, పక్షుల వంటివి బెడ్ దగ్గరకు రాకుండా ఇనుప జాలీ వంటిది ఏర్పాటు చేసుకోవాలి. బెడ్ ఎప్పుడూ పాకవంటి దానిలో నీడలో వుండాలి. కనీసం చెట్టు నీడైనా వుండాలి.
- తయారైన కంపోస్టుకు ఎండగాని, వానగాని తగలకూడదు. ఎందకంటే వాటికి తడి తాకి, కంపోస్టులో మిగిలిన చిన్న చిన్న వానపాముల చర్య వలన చినిగిపోతాయి. పాత సిమెంట్ బస్తాలను బాగా శుభ్రం చేసి వాడవచ్చు.
- బెడ్‌లో ఎప్పుడూ పదను ఉండేటట్టు చేసుకోవాలి.
- వానపాములు తినడానికి ఎప్పుడూ తిండి ఉండేటట్టు చూసుకోవాలి.
- ఒక కిలోకు 1000 వానపాములు తూగుతాయి. ఒక కిలో వానపపాములు ఎటూ గజం ఉండే బెడ్‌కు సరిపోతాయి. సరైన పరిస్థితులలో 1000 వానపాములు రోజుకు 5 కిలోల చెత్తను కంపోస్టుగా మారుస్తాయి.
- బెడ్‌లో వేసే పదార్థాలను వేరే కుప్పగా పోసి దానిపై ప్రతిరోజు మజ్జిగతో పూర్తిగా తడిసేలా చిలకరిస్తూ వుంటే 15 రోజుల్లో అవి సగం కుళ్ళుతాయి. అలా సగం కుళ్ళిన పదార్థాన్ని బెడ్‌లో వేస్తే నెల రోజులకై వర్మీ కంపోస్ట్ తయారవుతుంది.

## వర్మీ కంపోస్ట్ లాభాలు

- వర్మీ కంపోస్ట్‌తో నత్రజని, పొటాష్, భాస్వరం వంటి పోషకాలే కాకుండా కాల్షియం, మెగ్నీషియం, బోరాన్, జింక్, మాంగనీస్, కాపర్, మాలిబ్డినమ్ వంటి సూక్ష్మపోషకాలు పంటకు అందుతాయి.
- యూరియా, డిఎపి వంటి రసాయనిక ఎరువులు వాడాల్సిన అవసరం వుండదు.
- పంటకు తెగుళ్ళను తట్టుకునే శక్తి పెరిగి, పురుగు మందులకు అయ్యే ఖర్చు చాలా వరకు తగ్గుతుంది.
- తక్కువ నీటితో సాగు చేయవచ్చు.
- భూమి గుల్లబారి నీరు ఇంకే, నీటిని నిల్వచేసే గుణం పెరుగుతుంది.
- భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మక్రిముల సంఖ్య పెరుగుతుంది.
- భూమిసారవంతమై పంటదిగుబడి పెరుగుతుంది.
- ఏటా నిలకడైన పంటదిగుబడి వస్తుంది.
- పండిన పంట ఎక్కువ రోజులు పాడవకుండా వుండటమే కాక మంచి రుచిగా వుంటుంది.

## వర్మీ కంపోస్ట్ ఎప్పుడు / ఎంత వేయాలి

దుక్కిలో వర్మీ కంపోస్ట్ వేయాలి

పంట ఎదిగే సమయంలో వర్మీకంపోస్ట్ వేయాలి

ఒక ఎకరానికి ఒక టన్ను వర్మీకంపోస్ట్ ఎరువు వేయాలి.

వర్మీ కంపోస్ట్‌ను దుక్కిలో కానీ లేదా పొలంలో తడి ఉన్నప్పుడు వేయాలి. పై మందుగా వేసినప్పుడు పొడిగా ఉన్న కంపోస్టు మట్టిలో కలిసేటట్టు చూసుకోవాలి. అన్ని రకాల పంటలకు వేయవచ్చు.

# వర్మీకంపోస్ట్ ఆదాయవ్యయాలు

| | | |
|---|---|---|
| 1. | ఇటుకలతో బెడ్ కట్టడానికి అయ్యే ఖర్చు (3గజాల పొడవు, 1 గజం వెడల్పు, 1 అడుగు ఎత్తు) | రూ. 5000 |
| 2. | నీడ కోసం గుడిసె వేయడానికి | రూ. 500 |
| 3. | వానపాములు కొనడానికి | రూ. 500 |
| 4. | బెడ్ వేయడానికి ఇద్దరు కూలీలకు రూ.25 చొప్పున | రూ. 50 |
| 5. | ఎరువు తయారవడానికి పట్టే సమయం | 30-40 రోజులు |
| 6. | ఎరువు తయారయ్యే వరకు అప్పుడప్పుడు నీళ్ళు పోయడానికి నలుగురు కూలీలు | 25 +4 = రూ.100 |
| 7. | మొత్తం ఖర్చు | రూ. 1650 |
| 8. | ఏడాదికి ఎరువు దిగుబడుల సంఖ్య | 8 |
| 9. | ప్రతిసారి 1 బెడ్ నుండి వచ్చే ఎరువు | 200కి. |
| 10. | ఏడాదిలో వచ్చే ఎరువు | 200×8=1600కి. |
| 11. | ఏడాదిలోవచ్చే ఎరువు విలువ కిలో రూ.2 చొప్పున | రూ.1600×2=రూ.3200 |
| 12. | ఒక ఏడాదికి ఖర్చుపోగా వర్మీకంపోస్ట్ పద్ధతి ద్వారా వచ్చే లాభం | 3200-1650 = రూ. 1550 |

**గమనిక :** బెడ్ కట్టడానికి, గుడిసెకు, వానపాములకు ఖర్చు మొదటి సంవత్సరం మాత్రమే వుంటుంది. ఏడాది తర్వాత వానపాముల సంఖ్య నాలుగింతలు అవుతుంది.

## వానపాముల సంఖ్య పెరిగితే ఏమి చేయాలి ?

తయారైన వర్మీకంపోస్ట్‌ను మన పొలానికి వాడడమే ప్రధాన ఉద్దేశంగా ఉండాలి. మన అవసరాలకు సరిపోగా ఇంకా ఎక్కువ కంపోస్టు తయారవుతుంటే, మనం దానిని ఇతరులకు అమ్మాలి. ఇదే విధంగా వానపాముల సంఖ్య పెరిగి బెడ్ నిండా వుంటే, వేరొక బెడ్ తయారు చేసుకొని, సగం వానపాములు అందులో వేసుకోవాలి. లేదా గ్రామంలోని ఇతర రైతులకు కానీ చుట్టు పక్కల ప్రాంతంలో వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవడానికి ముందుకు వచ్చేవారికి గానీ ఎక్కువైన వానపాములు అమ్మవచ్చు.

డిడియస్ సహకారంతో జహీరాబాద్ ప్రాంతంలో తమ ఇంటి పెరట్లలో వర్మీకంపోస్టు తయారు చేస్తున్న సుమారు వెయ్యి మంది దళిత మహిళలు ఈ విధంగా తమ అవసరాలకు సరిపోగా ఎక్కువైన కంపోస్టు, వానపాములను ఇతరులకు అమ్మి ఒక్కొక్కరు సంవత్సరానికి రూ. 1000-3000 వరకు ఆదాయం పొందుతున్నారు. 3 సం॥ల క్రితం వర్మీకంపోస్టు తయారుచేయడం మొదలుపెట్టిన కొందరు మహిళలు సంవత్సరానికి తమ పొలానికి సరిపోయే ఎరువు తయారుచేయడమే కాక సుమారు రూ. 5000 వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

# గత ఎనిమిది నెలలలో కె.వి.కె నందు జరిగిన ముఖ్య కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2004 :**

పోషకాహార వారోత్సవాల సందర్భంగా జాతీయ పోషకాహార సంస్థ **(NIN)** హైదరాబాద్ వారు నిర్వహించిన సదస్సులో డిడియస్ - కె.వి.కె. వారు ఒక ఎగ్జిబిషన్ నిర్వహించారు. స్థానిక ఆహారాల ప్రాముఖ్యతను సేంద్రీయ ఆహార పదార్థాల ప్రాముఖ్యతను, డి.డి.యస్ సంఘాల అనుభవాలపై ఆధారపడిన ప్రజెంటేషన్ చేయటం జరిగినది. (సెప్టెంబర్ 1-7)

సిటిఆర్ఐ రాజమండ్రి కె.వి.కెలో నిర్వహించబడిన కె.వి.కె.ల వర్క్‌షాపులో డి.డి.యస్ - కె.వి.కె. పాల్గొని వార్షిక నివేదికను సమర్పించింది. (సెప్టెంబర్ 16-17)

దేశవ్యాప్తంగా వివిధ సంస్థల నుండి ప్రభుత్వం నుండి ప్రతినిధులు రెండు రోజుల పాటు "జాతీయ నేర్చుకునే గుంపు" అనే వర్క్‌షాపులో డి.డి.యస్. అనుభవాలను అధ్యయనం చేయటం జరిగినది. ఆహార సార్వభౌమత్వం మరియు ఆడవారి అధికారం, మీడియా మార్కెట్ మొదలగు అంశాలపై ప్రత్యేక విశ్లేషణ జరిగినది. ఈ వర్క్‌షాపును ఐఐఇడి, యు.కె. మరియు డి.డి.ఎస్. సంయుక్తంగా నిర్వహించారు (సెప్టెంబర్ 20,21)

**అక్టోబర్ :**

నవజ్యోతి రామాయం పేట్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్.సి.ఎల్.పి. (నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్ట్) వారి 50 పాఠశాల ఉపాధ్యాయులకు ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత అనే వర్క్‌షాప్ నిర్వహించబడినది. ఆ కార్యక్రమానికి శ్రీ సూర్యభూషణ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్.సి.ఎల్.పి. ప్రత్యేక అతిధిగా పాల్గొన్నారు ( అక్టోబర్ 9, 2004).

హెచ్.కె. పాటిల్, కె.వి.కె. హుల్కోటి, గదగ్ జిల్లా కర్ణాటక రాష్ట్రం నుండి డిడియస్, కె.వి.కె. కార్యక్రమాలను చూసి తెలుసుకొనటానికి రెండు రోజుల పాటు సందర్శించారు. ముఖ్యంగా వాటర్‌షెడ్ పనులు, పురుగు మందులు వాడకుండా సస్యరక్షణ, విత్తనాల బ్యాంకు మరియు కె.వి.కె. దత్తత గ్రామమైన రాయపల్లిని దర్శించారు. డిడియస్ సంస్థ నిర్వహిస్తున్న పచ్చశాల, సంఘం దుకాణం, కెఫె ఎత్నిక్, రేడియో స్టేషన్ మరియు కమ్యూనిటీ మీడియా సెంటర్‌లను దర్శించి వివరాలు తెలుసుకున్నారు. (అక్టోబర్ 18-19)

డా॥ బి,యస్. హన్‌స్రా, ఎ.డి.జి., ఐ.సి.ఎ.ఆర్. న్యూఢిల్లీ అక్టోబర్ 30వ తారీఖున కె.వి.కె. నివాస గృహ సముదాయాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డా॥ ఎమ్.ఆర్. హెగ్డే, జోనల్ కో-ఆర్డినేటర్, డా॥ శశిభూషణ్, డాట్‌సెంటర్ సంగారెడ్డి, శ్రీ సాయన్న జె.డి., వ్యవసాయశాఖ, సంగారెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. డి.డి.యస్. ఛైర్మన్ ప్రొ॥ జి.యస్. అరోరా గారు, డైరక్టర్ మజర్ హుస్సేన్ గారు మరియు శ్రీ కె.వి. కృష్ణమాచారిగారు పాల్గొన్నారు.

**నవంబర్ 2004 :**

వ్యవసాయ అధికారులకు జిల్లా జె.డి. వ్యవసాయం శ్రీ సాయన్న గారి ఆధ్వర్యంలో కె.వి.కె. నందు వర్మికంపోస్టు తయారు చేయటం మరియు వర్మీవాష్ ఉపయోగాలు అనే అంశంపై కె.వి.కె. శాస్త్రవేత్త శ్రీ మురళి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. (నవంబర్ 17)

ఎఫ్.టి.సి. సంగారెడ్డి వారి సౌజన్యంతో మరియు ఆర్థిక సహకారంతో మహిళలకు జహీరాబాద్ మండలంలోని 5 గ్రామాలలో వివిధ అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వటం జరిగినది. (నవంబర్ 18,20,22,25,28)

"చిన్న పిల్లల" అభివృద్ధిపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని అంతర్జాతీయ స్థాయిలో డి.డి.యస్. నిర్వహించింది, మలేషియా, నెదర్లాండ్స్ మరియు ఇండియాల నుండి 19 మంది ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. (నవంబర్ 20-25)

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, తుల్జాపూర్ హుమ్నాబాద్ జిల్లా, మహారాష్ట్ర వారు నిర్వహించిన "ఆడవాళ్ల భూమి హక్కులు మరియు అభివృద్ధి" అనే వర్క్‌షాపులో హుమ్నాపూర్ రత్నమ్మ, మిరియంపూర్ సరెమ్మ, ఏడాకుల పల్లి స్వరూపమ్మ, పస్తాపూర్ శాంతమ్మ అను మహిళా రైతులు మరియు కె.వి.కె. శాస్త్రవేత్త శ్రీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. (నవంబర్ 24,25)

ఇ.ఇ.ఐ. రాజేంద్రనగర్, హైదరాబాద్ వారు నిర్వహించిన మట్టి, మొక్క మరియు నీరు పోషకాల విశ్లేషణ శిక్షణా కార్యక్రమంలో శ్రీ వి. మురళి మరియు విజయలక్ష్మిలు పాల్గొన్నారు. (నవంబర్ 29-30).

**డిసెంబర్ 2004 :**

సృష్టి మరియు ఐ.ఐ.ఎమ్. వారు అహ్మదాబాదులో నిర్వహించిన జాతీయ ఆహార దినోత్సవంలో కె.వి.కె. శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. (డిసెంబర్ 5-7)

గరికెపాడు, కృషి విజ్ఞాన కేంద్రం వారు నిర్వహించిన బయో-విలేజ్ వర్క్‌షాపులో శ్రీమతి చంద్రమ్మ, చిన్న చంద్రమ్మ, అనిషమ్మ అను మహిళా రైతులు మరియు శ్రీ వి. మురళి రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్నారు. (డిసెంబర్ 13,14)

కుసుమ మరియు శనగ పంటలపై క్షేత్ర దినోత్సవం నిర్వహించటం జరిగినది. 150 మంది రైతులు పాల్గొన్నారు. (డిసెంబర్ 22)

కె.వి.కె.లో దళిత వాటర్‌షెడ్ వర్క్‌షాపును డి.డి.యస్. సౌజన్యంతో నిర్వహించటం జరిగినది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థల నుండి 45 మంది వర్క్‌షాపులో పాల్గొన్నారు. (డిసెంబర్ 22,23)

## జనవరి 2005 :

నర్సరీ పెంపకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగినది. 21 మంది మహిళలు మరియు ఇద్దరు ఫీల్డు సూపర్‌వైజర్‌లు పాల్గొన్న కార్యక్రమాన్ని శ్రీ విజయ్ కుమార్ నిర్వహించారు. (జనవరి 1)

వెలుగు ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లకు (15 మంది) మరియు స్వయం సహాయక సంఘాల లీడర్లకు వర్మికంపోస్టు తయారీ మరియు వర్మీవాష్ వినియోగాలపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని శ్రీ వి. మురళి నిర్వహించారు. (జనవరి 5)

డి.డి.యస్. ఆధ్వర్యంలో సంచార జీవ వైవిధ్యం జాతరల ప్రారంభోత్సవం జహీరాబాద్ మండలం హోతి - బి గ్రామం నందు సంక్రాంతి శుభదినం నాడు డా॥ రాజేంద్ర సింగ్ రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత గారి చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీమతి నిర్మల జాయింట్ కమీషనర్ మరియు డా॥ జి.వి. రామాంజనేయులు, డైరెక్టర్, శాశ్వత వ్యవసాయకేంద్రం పాల్గొన్నారు. జీవ వైవిధ్యాన్ని సజీవంగా కాపాడుతున్న రైతులను సన్మానించారు. శ్రీమతి అంజమ్మ, శ్రీమతి పెంటమ్మ, శ్రీమతి శాంతమ్మ మరియు హోతి-బి సంఘం మహిళలు పురస్కారాన్ని అందుకున్నారు. డి.డి.యస్. డైరెక్టర్ శ్రీ పి.వి. సతీష్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడినది.

## ఫిబ్రవరి 2005 :

కృష్ణా జిల్లా నుండి వెలుగు మరియు 'సెర్ప్' సంస్థల ఆధ్వర్యంలో 360 మంది మహిళలు ఆరు విడతలుగా సందర్శించి జీవవైవిధ్యం జాతరలో పాల్గొన్నారు. (జనవరి 20 నుండి ఫిబ్రవరి 15 వరకు)

సంచార జీవవైవిధ్య ముగింపు ఉత్సవంలో వివిధ అంతర్జాతీయ అతిథులతో పాటు స్థానిక అధికారులు కూడా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి సునితా పాటిల్, శ్రీ పి.వి.యస్. సూర్యకుమార్, నాబార్డ్, డా॥ మిషెల్ పింబర్ట్, ఐ.ఐ.ఇ.డి., యు.కె., పొటాటో పార్క్ రైతులు, పెరూ నుండి, సి.ఐ.ఎన్.ఇ.ఎస్.టి.ఎ. సెనెస్టా రైతులు ఇరాన్ నుండి పాల్గొన్నారు. (ఫిబ్రవరి 15).

స్థానిక ఆహార పద్ధతులు, వ్యవసాయ జీవవైవిధ్య మరియు బ్రతుకు దెరువుల కొనసాగింపు అను సదస్సులో రైతుల అనుభవాల పరస్పర మార్పిడి అనే వినూత్న కార్యక్రమాన్ని డి.డి.యస్. నిర్వహించింది. స్థానిక జ్ఞానం విలువలు మరియు కాపాడుకోవటం అనే అంశాలపై రైతులు ఉత్సాహంగా తమ అనుభవాలను పంచుకున్నారు. చివరి రోజు పత్రికా సమావేశాన్ని నిర్వహించటం కూడా జరిగినది. (ఫిబ్రవరి 15-28).

## మార్చి 2005 :

వర్మికంపోస్ట్, నర్సరి పెంపకము మొదలగు అంశాలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. (మార్చి 7,8,9)

నాబార్డు సహకారంతో నిర్వహింపబడుతున్న వాటర్ షెడ్ రైతులకు ఒక రోజు సాంకేతిక అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. (మార్చి 10)

రైతు శిక్షణా కేంద్రం - ఆర్థిక సహకారం వ్యవసాయ అంశాలపై సమగ్ర శిక్షణా నిర్వహించడం (మార్చి 10,12,14)

శాశ్వత వ్యవసాయ పద్ధతుల పై రైతులకు అవగాహన మరియు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినారు.

వర్మీకంపోస్ట్ : ఎ.పి.మహిళా సమత సొసైటి వారి రైతు మహిళలకు వర్మీకంపోస్ట్ తయారిపై శిక్షణా కార్యక్రమం జరిగింది. (మార్చి 22)

మార్చి 28 : శాశ్వత వ్యవసాయ రైతుల వార్షిక మీటింగ్ జరిగింది. 200 మంది రైతులు పాల్గొన్నారు. (మార్చి 28)

## ఏప్రిల్ 2005 :

ఆంధ్రప్రదేశ్ కృషి విజ్ఞాన కేంద్రముల సమావేశము గుంటూరు జిల్లా ఆచార్యా యన్.జి. రంగా, కెవికె నందు జరిగినది. డి.డి.యస్ కెవికె పాల్గొని, గత 6 నెలలో జరిగిన కార్యక్రమాల నివేదికను సమర్పించింది. (ఏప్రిల్ 13-14)

ఎన్.బి.ఎస్.ఎ.పి. మధ్యప్రదేశ్ జీవవైవిధ్య బోర్డ్ మెంబర్స్‌తో కె.వి.కె.లో డి.డి.యస్ మహిళ రైతుల నుండి ప్రజల జీవవైవిధ్య రిజిస్టర్స్ తయారు చేయు విధానం నేర్చుకున్నారు. (ఏప్రిల్ 11).



# చింత చిగురు

LOCAL NAME : Chinta chiguru
పేరు : చింత చిగురు

ENGLISH NAME : Tamarind leaves

SCIENTIFIC NAME : *Tamarindus indica*
శాస్త్రీయ పేరు : టమరిండస్ ఇండికా

RECIPE : Curry with Pulses, other greens.

వంటకం : పప్పుతో గట్టి కూర, పచ్చిగింజ కూర

**NUTRIENT COMPOSITION / 100 G**

**పోషక విలువలు / 100 గ్రా**

| | | | |
|---|---|---|---|
| **Protein** | మాంసకృత్తులు | 5.8 | g |
| Fat | క్రొవ్వు | 2.1 | g |
| Minerals | లవణాలు | 1.5 | g |
| Fiber | పీచు పదార్థం | 1.9 | g |
| Carbohydrate | పిండిపదార్థం | 18.2 | g |
| Energy | శక్తి | 115 | Kcal |
| Calcium | కాల్షియం | 101 | mg |
| Phosphorous | ఫాస్ఫరస్ | 140 | mg |
| Iron | ఐరన్ | 0.3 | mg |
| Carotene | కెరోటిన్ | 250 | mg |
| Thiamin | థయామిన్ | 0.24 | mg |
| Riboflavin | రైబోఫ్లేవిన్ | 0.17 | mg |
| Folate | నయాసిన్ | - | mg |
| Vitamin A (RE) | విటమిన్ A (RE) | 42 | mg |
| Vitamin A | విటమిన్ A | 417 | IU |
| Vitamin-C | విటమిన్ -C | 3 | mg |

**Good for eye sight / కంటి చూపు మంచిగా ఉంటది**

**Prevents Constipation / మలబద్ధకాన్ని నివారిస్తుంది.**

**Reference:** Nutritive value of Indian foods. 2002. S no 47

## వినియోగదారులకు శుభవార్త

రసాయన ఎరువులు పురుగు మందులు వాడకుండా పండించిన అధిక పోషక విలువలు గల జొన్న, సామ, తైద (రాగి), అర్కలు, సజ్జలు, పెసరపప్పు, మినపపప్పు, కందిపప్పు మరియు బెల్లం సరసమైన ధరలకు మావద్ద లభించును.

**డి.డి.యస్.-మహిళా సంఘాల, వినియోగదారుల పరస్పర సహాయక, సహకార పొదుపు సంఘం లిమిటెడ్**

(సంఘం దుకాణం) మెయిన్ రోడ్, జహీరాబాద్ - 502 220, మెదక్ జిల్లా

మెదక్ జిల్లా ప్రాంత రైతులకు శుభవార్త

త్వరలో డి.డి.యస్. - కె.వి.కె. యందు మట్టినమూనా పరీక్ష కేంద్రం

**SOIL TESTING LAB**

ప్రారంభిస్తున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము


Printed Matter Book Post


ప్రచురణకు వ్యాసాలు, సలహాలు
పంపవలసిన చిరునామా....

**డి.డి.యస్. - కృషి విజ్ఞాన కేంద్రం**

పోస్ట్ బాక్స్ నెం. 214,
జహీరాబాద్ - 502 220, మెదక్ జిల్లా
ఫోన్ : 08451 - 282809, 275150, 55003



| సంపాదకులు | EDITORS |
| --- | --- |
| శ్రీమతి బి. సలోమి ఏసుదాసు | Smt. B. SALOMEYESUDAS |
| శ్రీ విజయ్ కుమార్ కోరి | Sri VIJAY KUMAR KORI |